ఎంఈఓ కార్యాలయానికా.. మేము రాము బాబోయ్!

- వర్షాలకు ఉరుస్తున్న లక్కిరెడ్డిపల్లె ఎంఈఓ కార్యాలయం
- కార్యాలయానికి వెళ్లడానికి జంకుతున్న ఉపాధ్యాయులు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన
- భవనం నిర్మించాలంటూ వేడుకోలు



ఎంఈఓ కార్యాలయంలో పెచ్చులూడి సిబ్బందిపై పడటంతో తృటిలో తప్పిన ప్రమాదం



వర్షాలకు ఉరుస్తున్న ఎంఈఓ కార్యాలయ స్లాబ్

లక్కిరెడ్డిపల్లి : ఉపాధ్యాయులు లక్కిరెడ్డిపల్లె ఎంఈఓ కార్యాలయానికి వెళ్లడానికి కూడా జంకుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఎప్పుడు.. ఎక్కడ పెచ్చులూడి మీదపడతాయో తెలియక ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షానికే లక్కిరెడ్డిపల్లి ఎంఈఓ కార్యాలయం ఉరించడమే కాక గదుల్లో స్లాబ్ పెచ్చులూడి పడుతుండటంతో పనిచేసే కార్యాలయ సిబ్బంది, టీచర్లు భయభ్రాంతాలకు గురై కార్యాలయం వదిలేసి బయటకు పరుగులు పెడుతున్నారు. గత రెండు రోజులపాటు చిన్నపాటి వర్షం పడుతుండటంతో శుక్రవారం ఆఫీసు సమయంలో స్లాబ్ పెచ్చులూడి పడటంతో అందులో పనిచేస్తున్న సిబ్బందికి తృటిలో ప్రమాదం తప్పింది. కార్యాలయం చాలా సంవత్సరాలుగా పాత భవనంలోనే ఉండటంతో ఇంతకు మునుపు పెచ్చులూడే సమయంలో సిమెంట్‌తో ప్లాస్టింగ్ చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. మరోమారు చిన్నపాటి వర్షం కురిసినా పైపెచ్చులూడి పడుతుండటంతో అందులో పనిచేస్తున్న ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్యలతోపాటు సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే మండలంలోని ఉపాధ్యాయులు భవనం పైపెచ్చులూడి ఎక్కడ తమమీద పడతాయోనని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత భవనానికి మరమ్మతులు చేయడంకంటే కూడా నూతన భవనం మంజూరు చేయాలని ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు.

మాతోపాటు మా రికార్డులకు భద్రత లేదు



మాతోపాటు మా రికార్డులకు ఎంఈఓ కార్యాలయంలో భద్రత లేదు. చిన్నపాటి వర్షానికి పెచ్చులూడి పడుతుండటంతో కార్యాలయానికి వెళ్లాలంటే భయం వేస్తోంది. ఇంతకు మునుపు ఒకసారి కార్యాలయానికి మరమ్మతులు చేసినా ఫలితం లేకపోవడంతో ప్రస్తుతం మరలా పెచ్చులూడుతోంది. ఎంఈఓలు చొరవచూపి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన ఎంఈఓ కార్యాలయ భవనాన్ని మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలి. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కూడా భయభ్రాంతాలకు గురవుతున్నారు.

– ఎస్.శివశంకర్ రెడ్డి, ఉపాధ్యాయుడు, లక్కిరెడ్డిపల్లి మండలం

కూటమి కళ్లు తెరిపించేందుకే సంతకాల సేకరణ

- పేదలకు వైద్య విద్య దూరం చేసేందుకు చంద్రబాబు కుట్ర
- పోస్టర్ ఆవిష్కరణలో మున్సిపల్ చైర్మన్ పోలా, నాయకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజంపేట టౌన్ : మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు సిద్ధమైన చంద్రబాబునాయుడుకు కోటి సంతకాల సేకరణతో కళ్లు తెరిపిద్దామని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సూచనల మేరకు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న కోటి సంతకాల సేకరణకు సంబంధించిన పోస్టర్‌ను పోలా శ్రీనివాస్‌రెడ్డి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరమైతే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటయ్యే ఆయా ప్రాంతాల పేద ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా మారుతుందన్నారు. జగన్ హయాంలోనే ఐదు మెడికల్ కళాశాలలు పూర్తయ్యాయని, మరో మూడు కళాశాలలు చివరి దశలో ఉన్నాయన్నారు. ముఖ్యంగా పులివెందుల మెడికల్ కళాశాలలో ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు కూడా ప్రారంభించివుండవచ్చని అయితే చంద్రబాబునాయుడు పులివెందుల మెడికల్ కళాశాలపై కక్షకట్టిన కారణంగా ఈ ఏడాది అడ్మిషన్లు లేకుండా పోయాయని చెప్పారు. గత ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిచింటే 17 మెడికల్ కళాశాలను ప్రభుత్వమే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేదని, తద్వారా మెడిసిన్ చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేదన్నారు. అయితే చంద్రబాబునాయుడుకు మెడికల్ కళాశాలలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు మనసు రావడం లేదని ఆరోపించారు. సీఎం తన బినామీలకు, తనకు లాభం చేకూర్చే అనుచరులకు మెడికల్ కళాశాలలను అప్పజెప్పేందుకు పిపిపి విధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. సంతకాల సేకరణలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రక్కాసి శ్రీవాణి, వివిధ విభాగాల కన్వీనర్లు డీలర్ సుబ్బరామిరెడ్డి, పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, డి.భాస్కర్‌రాజు, జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, దయానంద్, మిర్యాల సురేఖ, వరదరాజు, కూండ్ల రమణారెడ్డి, న్యామతుల్లా, సనిశెట్టి నవీన్‌కుమార్, సూరి, రెడ్డిమాసి రమేష్‌నాయుడు, కమలాకర్, దండు గోపి, దాసరి పెంచలయ్య, కల్యాణ్, రామ్‌నగర్ శివ, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

‘తప్పుడు రాతలు రాస్తే ఉపేక్షించబోం’

- ఎంత విషం చిమ్మితే అంత బలంగా పనిచేస్తాం
- రప్పా..రప్పా అంటూ అసత్య వార్తను ప్రచురించడంపై ఖండన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజంపేట టౌన్ : వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి తట్టుకోలేక పచ్చ పత్రిక తప్పుడు రాతలు రాయడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ డి.భాస్కర్‌రాజు హితవు పలికారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓ పచ్చ పత్రికలో ‘రాజంపేటలో రప్పా..రప్పా’ అంటూ ఈ యేడాదివినాయక చవితి సందర్భంగా మందపల్లె ప్రాంతంలో ఎవరో కొంత మంది రప్పా..రప్పా అనే బ్యానర్‌తో నిమజ్జన కార్యక్రమం చేపట్టారన్నారు. అయితే ఆ పత్రిక ఆ ఫోటో పెట్టి గురువారం ఆకేపాటి ఎస్టేట్‌లో జరిగిన వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం సందర్భంగా ఆకేపాటి ఎస్టేట్‌కు సమీపంలో హిజ్రాలు రప్పా..రప్పా బ్యానర్లు చేతబట్టి చిందులేసినట్లు అసత్య కథనాన్ని ప్రచురించడం ఆ పత్రిక యాజమాన్యం, సిబ్బంది దిగజారుడుతనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. జగన్‌పై, వైఎస్సార్‌సీపీపై ఎంత విషం చిమ్మితే అంత బలంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు జగన్‌ను సీఎంను చేసేందుకు సైనికుల్లా పనిచేస్తారనేది గుర్తించుకోవాలన్నారు. తమకు పత్రికలన్నా, ప్రజాస్వామ్యం అన్న ఎంతో గౌరవం ఉందని, అయితే తప్పుడు రాతలు రాస్తే మాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇప్పటికే పచ్చ పత్రికలు ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయాయని, ఇప్పటికైనా తమ శైలిని మార్చుకోకపోతే ఆ పత్రికలను చూసే నాథుడు కూడా ఉండరన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు కమలాకర్, దాసరి పెంచలయ్య, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..



ఒకటవ వార్డులో మురుగునీటిని తొలగించి, వీధిలో గ్రావెల్ చిప్స్‌తో నింపిన దృశ్యం

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు నందు గత కొన్ని నెలలుగా నెలకొన్న మురుగునీటి సమస్యపై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండే వారు. ఈ విషయంపై గురువారం సాక్షి దినపత్రికలో ‘చిత్తశుద్ధి కనుమరుగు’ అనే కథనాన్ని ప్రచురించడం జరిగింది. కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు, వార్డు కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్ ప్రసాద్ అధ్వర్యంలో శుక్రవారం ఒకటో వార్డులోని వీధిలో నిలువ ఉన్న మురుగునీటిని తొలగించి, రాళ్ల పలుకులతో నింపారు. దీంతో స్థానిక మహిళలు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఒకటవ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ ఒకటవ వార్డుకు మంజూరైన రూ.12లక్షల నిధులతో ఈ వీధిలో మురుగు నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం త్వరలో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడామన్నారు.

డిజిటల్ బుక్‌తో కూటమి ఆగడాలకు చెక్



మూరీ శంకరరెడ్డి

రైల్వేకోడూరు : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధించడమే లక్ష్యంగా జరుగుతున్న రాష్ట్రంలో జరుగుతున్న రెడ్ బుక్ పాలనకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌తో చెక్ పెట్టారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు మూరీ శంకరరెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం శంకరరెడ్డి మాట్లాడుతూ లేని అక్రమ మద్యం కేసులో ఎంపీ మిథున్‌రెడ్డి వంటి ప్రజల మనిషిని అరెస్టు చేసి కూటమి ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందిందన్నారు. కానీ టీడీపీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ములకలచెరువులో కల్తీ మద్యం తయారు చేసి పేదల ప్రాణాలు తీస్తున్న పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయక అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసుకుని కూటమి కుట్రలపై పోరాటం సాగిద్దామన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయించండి



భావనారుషి గుడి వద్ద నిల్వ ఉన్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయశ్రీ

పుల్లంపేట : పుల్లంపేట మండల కేంద్రంలో వివిధ రోడ్లకు మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు ఎంపీడీఓ జయశ్రీని కోరారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలో పర్యటించారు. భావనారుషి గుడి వద్ద వర్షపునీరు నిల్వ ఉండటంతో కారణాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ముత్తయ్యను స్థానికుల నుంచి వినతి పత్రం తీసుకొని రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని తెలియజేశారు. కాగా ఇటీవల చేపట్టిన పారిశుద్ధ్య పనులను సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసుల రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతిదినం వీధుల్లో చెత్తసేకరించాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి వీధుల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు.

‘చెకుముకి’ సంబరాలు విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరణలో ఎంఈఓ, జేవీవీ నాయకులు

సిద్దవటం : జనవిజ్ఞాన వేదిక, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేద్దామని మండల విద్యాశాఖ అధికారిణి–2 అరుణ, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్‌బాషాలు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలను ప్రతి ఏటా 8, 9, 10వ తరగతి విద్యార్థుల్లో ఉన్నటువంటి సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి ఈ సంబరాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అలాగే చెకుముకి రాష్ట్ర కోకన్వీనర్ బాలుగారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఈ సైన్స్ సంబరాలు నాలుగు దశల్లో నిర్వహిస్తామని మొదటగా పాఠశాల స్థాయిలో అక్టోబర్ 18, మండల స్థాయి నవంబర్ 1, జిల్లా స్థాయి నవంబర్ 23, రాష్ట్ర స్థాయిలో డిసెంబర్ 12, 13, 14వ తేదీలలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. జేవీవీ మండల అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో ఉన్నటువంటి విద్యార్థులతో ఈ పరీక్షను రాయించాలని కోరారు. అనంతరం చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, జేవీవీ సభ్యులు షేక్ మౌలాలి, శ్రీనివాసులు, ఎంఆర్‌సీ సిబ్బంది గౌతమి, హేమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రోత్సాహానికి రూ.లక్ష విరాళం



బాండ్‌ను ప్రిన్సిపల్‌కు ఇస్తున్న దాత నరసింహులు

రాజంపేట టౌన్ : రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు రిటైర్డ్ ప్రిన్సిపల్ మద్దిపట్ల నరసింహులు నాయుడు రూ.1 లక్షను విరాళంగా ఇచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నరసింహులునాయుడు ఈ మొత్తానికి సంబంధించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండును ప్రిన్సిపల్ ఎస్వీ.రమణరాజుకు అందజేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ రమణరాజు మాట్లాడుతూ నరసింహులునాయుడు ఇదే కళాశాలలో చదువుకోవడమే కాక లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా కూడా పనిచేశారని తెలిపారు. తాను చదువుకున్న, పనిచేసిన కళాశాలపై మమకారంతో ఇక్కడి విద్యార్థులను ప్రోత్సహించేందుకు విరాళం ఇవ్వడం సంతోషకరమన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ ద్వారా వచ్చే వడ్డీని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందిస్తామని చెప్పారు. రిటైర్డ్ ప్రిన్సిపల్ నరసింహులునాయుడు మాట్లాడుతూ రాజంపేట ప్రభుత్వ కళాశాలకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, ఇక్కడ చదువుకున్న అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పరామర్శ



ఈడిగపల్లె మహిళలతో మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని అనంతపురం గ్రామం ఈడిగపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గణేష్ తండ్రి సుబ్బరాయుడు ఇటీవల మృతి చెందాడు. వారి దశదిన ఖర్మకాండ సందర్భంగా శుక్రవారం రాత్రి ఈడగపల్లిలో గణేష్ నివాసానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడు సుబ్బరాయుడు చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ప్రజలతో శ్రీకాంత్ రెడ్డి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఏమి కష్టం వచ్చినా తోడుగా ఉంటానని హామీనిచ్చారు. కార్యకర్తలు, నాయకులతో ఆయన పలు అంశలపై చర్చించారు. సమష్టిగా పార్టీని బలోపేతం చేసుకుందామని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చంద్రశేఖర్, ఓబులేసు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

12న పెన్షనర్ల సమస్యలపై సదస్సు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పెన్షన్ వ్యవస్థ సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడి అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ 95 పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట రూరల్ : రాజంపేట పట్టణం, నందలూరు మండలాల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజంపేట పట్టణంతో పాటు సరస్వతీపురం, తాళ్లపాక, నందలూరు టౌన్, పాటూరు, చింతకాయలపల్లి, ఎన్‌టీపల్లి, చెన్నయ్యగారిపల్లి, సబ్‌స్టేషన్ నందు గల 11కేవీ ఫీడర్‌కు సమీపంలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించగలరని కోరారు.

15న మండల సమావేశం

పుల్లంపేట : ఈనెల 15వ తేదీన స్థానిక సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. అలాగే అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

మల్లూరమ్మకు అభిషేకాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసియున్న శ్రీ మల్లూరమ్మకు భక్తులు అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో అమ్మవారి మూలవిరాట్ మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. సమీప ప్రాంతాల భక్తులు పలువురు పాల్గొనగా అమ్మవారికి పలు పూజాది క్రతువులు జరిపారు. పూజల్లో పాల్గొన్న వారికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

గర్భిణులకు భోజన సౌకర్యం



గర్భిణులకు ఆహారం వడ్డిస్తున్న దృశ్యం

వీరబల్లి : ప్రతి నెల 9, 10వ తేదీలలో గర్భిణులకు పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తుంటారు. పరీక్షలకు వచ్చే గర్భిణులకు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి భోజనం అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శుక్రవారం 44వ సారి గర్భిణులకు ఆయన భోజన వసతి కల్పించారు. అంతకుముందు మహిళలను డాక్టర్ భవ్య పరీక్షించి మందులు అందజేసి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

పుల్లంపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా డివిజన్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలను శుక్రవారం స్థానిక ఎస్‌బీవీడీ సభా ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పరుగు పందెం, జావెలిన్ త్రో, షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్ తదితర పోటీలను జరిపారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 50 మంది క్రీడాకారులను డివిజనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు పీడీ బాలశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సాయిరాం, మయూరి, కనకదుర్గలు పాల్గొన్నారు.

పోస్ట్‌మాస్టర్‌కు సత్కారం



పోస్ట్ మాస్టర్ దొరస్వామి నాయక్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గాలివీడు : స్థానిక పోస్టాఫీసులో గురువారం ప్రపంచ తపాలా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రవిచంద్ర సీబీఎస్‌ఈ, గౌతమ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల విద్యార్థులు పోస్ట్ మాస్టర్ దొరస్వామి నాయక్ దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాధవరంలో ఫ్రైడే.. డ్రైడే

సిద్దవటం : మాధవరం–1 పంచాయతీ ఎస్‌కెఆర్ నగర్ గ్రామంలో రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగింపు చర్యలు చేపట్టారు. ఎస్‌కెఆర్ నగర్ గ్రామంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ అవ్వారు జానకిరామయ్య అధ్యక్షతన డ్రైడే ఫ్రైడే సందర్భంగా ఎస్‌కె నగర్‌లోని పారిశుద్ధ్య పనులు చేశామన్నారు. అలానే మురికి కాలువల్లో దోమల నియంత్రణకు అబెట్, బ్లీచింగ్ పిచికారీ చేసినట్టు చెప్పారు.

ఎస్జీఎఫ్‌లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న టీచర్లు

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ తెలిపారు. మండల స్థాయిలో జరిగిన అండర్–17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడాపోటీలకు అండర్–17 కబడ్డీ విభాగంలో రెడ్డయ్య, హరికృష్ణ, మహేష్, ఫాహద్, అండర్–14 ఖోఖో విభాగంలో ఉబెద్, విజయ్, నాగేంద్ర ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో కావ్య, వాసవి, హిమవర్ష, అండర్–14లో మహిదర్, బాబీ, యశ్వంత్, అండర్–17 వాలీబాల్ పోటీల్లో నంద, ఫహద్ ఎంపికైనట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రిన్సిపల్ దిలీప్, క్రీడా పోటీల కో–ఆర్డినేటర్ అమర్‌నాథ్‌రెడ్డి, పీడీ షామీర్, ఉపాధ్యాయులు సత్కరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వీరబల్లి: మండల కేంద్రంలోని దళితవాడలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల అవగాహన కార్యక్రమం

సిద్దవటం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి పరిసర ప్రాంతాలను శుభ్రంగా పెట్టుకోవాలని మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సాయి వీరప్రసాద్ తెలిపారు. సిద్దవటం మండలం మాధవరం పీహెచ్‌సీలో శుక్రవారం ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పుల వల్ల జలుబు, దగ్గు, జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని, గృహాల పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి జ్వరాలు సోకే ప్రమాదం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా పెట్టుకుంటే సీజనల్ వ్యాధులు దరిదాపులోకి రావని ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త వహించాలని పల్లె ప్రాంతాల్లో తాగునీటి ట్యాంకులు శుభ్రపరిచి బ్లీచింగ్‌తో పిచికారీ చేయాలని డాక్టర్ సాయి వరప్రసాద్ తెలిపారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గత మూడు రోజులుగా వీరబల్లి పంచాయతీలోని పెద్ద దళితవాడ నందు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహించి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వర్షాకాలంలో వచ్చేటటువంటి వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులపైన ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన దోమలు, క్రిమికీటకాలు దరిచేరవని ప్రజలకు వివరించారు. తదుపరి వాలంటీర్లకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సి.భాస్కర్, జి.రఘురామయ్య, అరుణమ్మ, చంద్రకళ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



విద్యుత్ ఏఈకి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

గాలివీడు : చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ బీసీ సంక్షేమ సంఘం చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీరభాస్కర్ మండల విద్యుత్ ఏఈ అవుల లక్ష్మయ్యను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు ఏ ఒక్క పథకం ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. ముఖ్యంగా నేతన్నలకు గుంత మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని తక్షణం అమలు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నేతన్నల కోసం అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిందని ఆయన విమర్శించారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం జౌళీ శాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రతి నేతన్న కుటుంబానికి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శిబ్యాల వెంకటరమణ, చేనేత కార్మికులు శివప్రసాద్, రెడ్డిబాబు, శంకర్, ఓర్సు వెంకటరమణ, వై.రాము, పి.కృష్ణమూర్తి, వై.వెంకటరమణ, ఓర్సు చిన్నరెడ్డప్ప, శంకరన్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అధ్యాపకులు అందిపుచ్చుకోవాలి



శిబిరంలో పాల్గొన్న అధ్యాపకులు

రాయచోటి అర్బన్ : మారుతున్న కాలానుగుణంగా విద్యాబోధనలో పరిశోధానాత్మకత అవలంబించడం ఎంతో ముఖ్యమని ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యారంగం వేగంగా మారుతున్న కాలంలో అధ్యాపకులు నిరంతరంగా తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కొత్త పద్ధతులు, పరిశోధానాత్మక దృక్కోణంపై అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ విశ్వనాథరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. కళాశాల డైరెక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు సాంకేతికతను బోధనలో సమర్థవంతంగా వినియోగించే మార్గాలను నేర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 38 మంది అధ్యాపకులు హాజరయ్యారు. ప్రిన్సిపల్ వెంకట రమణ, సమన్వయకర్త నరేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.